క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ తెలిపారు. స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ రామ్‌కుమార్స్ షుగర్ కేర్ సెంటర్‌లో సాయంత్రం 6 గంటల నుంచి బీపీ, షుగర్, బాడీమాస్ ఇండెక్స్ (బీఎంఐ) పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం ఒబెసిటీ, థైరాయిడ్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన సదస్సు జరుగుతుందని, నగర ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

డిస్కం అధ్యక్షునిగా ఎన్నికైన దాసుబాబుకి సత్కారం



నగరంపాలెం: ఇటీవల ఏపీఎస్‌ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీసీపీడీసీఎల్ డిస్కం అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లపాటి దాసుబాబుని వైఎస్సార్ యూనియన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు గురువారం గుంటూరు విద్యుత్ భవన్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యుత్ సీనియర్ గణాంక అధికారి పి.రామిరెడ్డి, ఏఓ పి.వెంకటేశ్వర్లు, విజయభాస్కర్, అలి, కె.సారథి, రాయపాటి సీతారామయ్య పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

నెహ్రూనగర్: 18 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్సీలుగా కొనసాగుతున్న రజకుల్ని రాష్ట్రంలో కూడా ఆ జాబితాలో చేర్చే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని నేషనల్ దోభి మహా సంఘ్ కన్వీనర్ అన్నవరపు నాగమల్లేశ్వరరావు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు గురువారం పల్నాడు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక మహిళలకు రక్షణ చట్టం కల్పించాలని, వృత్తి చెరువులపై శాశ్వత హక్కు కల్పించాలని కోరారు.

విగ్రహం తొలగింపు ఆలోచనే లేదు: మేయర్

నెహ్రూనగర్: రాజకీయ మనుగడ కోల్పోయిన కొందరు నేతలు ఉనికిని కాపాడుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని, విగ్రహాల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం సమంజసం కాదని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. చుట్టుగుంట సెంటర్‌లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతురావు విగ్రహాన్ని తొలగిస్తున్నారని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలపై ఆయన పై విధంగా స్పందించారు. సమరయోధులు, ప్రముఖ నాయకుల విగ్రహాలను గౌరవించి వాటిని కాపాడుకునే సంస్కృతి తమదని పేర్కొన్నారు. ప్రజలతో ఛీత్కరించబడి రాజకీయాల్లో తమ ఉనికిని చాటుకునేందుకు కొందరు ఇలాంటి నీచ రాజకీయాలకు తెరదీస్తున్నారని మండిపడ్డారు. ప్రజలంతా వారిపై అప్రమత్తంగా ఉండాలని మేయర్ కోరారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



గుంటూరు మెడికల్: ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండటానికి కావల్సిన అవగాహన పొందే హక్కును కల్పించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కలపాల రత్నకుమార్ అన్నారు. గురువారం జీజీహెచ్ మానసిక వైద్య విభాగంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సులో జడ్జి రత్నకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం, మంచి నీటిని పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే బాధ్యత కలిగి ఉన్నప్పుడే ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం రోగులకు పండ్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్లాది వెంకట కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికిరణ్, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం

పట్నంబజారు: అక్కచెల్లెమ్మకు అండగా తాను న్నానే భరోసా కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డెప్యూటీ మేయర్ షేక్ సజీల పేర్కొన్నారు. 7వ డివిజన్ కొత్తపేటలో సచివాలయంలో గురువారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ మాట్లాడుతూ మహిళలకు సీఎం చేయూతనందిస్తూ, అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. తూర్పు నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా మాట్లాడుతూ మహిళా సాధికారిత సీఎం ద్వారానే సాధ్యపడుతుందని పేర్కొన్నారు.

సీఎంకు స్వాగత సుమాంజలి

చిలకలూరిపేటలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహరనాయుడు, టీచర్స్ ఎమ్మెల్సీ కల్పలత, జెడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి















పూర్వ వైద్య విద్యార్థుల సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే ముస్తఫా

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు తమ మాతృ సంస్థకు చేస్తున్న సేవలను ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అన్నారు. గురువారం జీజీహెచ్‌లో సుమారు రూ. 75 లక్షలు విలువ చేసే వైద్య పరికరాలను గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థిని 1962 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ విజయలక్ష్మి అందజేశారు. ఆమె సమీప బంధువు బి.శ్రీనివాసరావు సదరు వైద్య పరికరాలను జీజీహెచ్ ఎనస్థీషియా వైద్య విభాగానికి ఎమ్మెల్యే ముస్తఫా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రోగి ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే వైద్య పరికరాలను అందజేసిన పూర్వ వైద్య విద్యార్థినికి కృతజ్ఞతలు తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ ఆపరేషన్ల సమయంలో సదరువైద్య పరికరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు మాతృ సంస్థను మరిచిపోకుండా వైద్య పరికరాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎనస్థీషియా వర్క్ స్టేషన్లు ఐదు, మానిటర్లు ఐదు, డిఫ్రిబిలేటర్లు, సిరంజి పంపులు రెండు అందజేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకళ, ఎనస్థీషియా వైద్య విభాగాధిపతి డాక్టర్ విష్ణు మహేష్‌బాబు, ప్రొఫెసర్ డాక్టర్ కె.పోలయ్య, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ వి.నాగభూషణం, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.



విరాళంగా ఇచ్చిన వైద్య పరికరాలతో ఎమ్మెల్యే ముస్తఫా,సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి

యువత భవిష్యత్తుకు దశదిశా నిర్దేశించేలా జగన్ పాలన

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి

పట్నంబజారు: యువత భవిష్యత్తుకు దశదిశా నిర్దేశించేలా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత లక్షలాది ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. భవిష్యత్తులోనూ అనేక పరిశ్రమల ద్వారా ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సీఎం జగన్‌కు అండగా యువత నిలబడాలని ఆయన కోరారు. బృందావన్ గార్డెన్స్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జరిగే 'జగనన్న పాలనలో యువత సాధికారిత' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి యువత సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు.

ఆడపడుచులకే అగ్ర తాంబూలం

- రాష్ట్రంలో మహిళా రాజ్యం పరిపాలన
- అన్నగా సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ రంగంలోనైనా ఆడపడుచులకే అగ్ర తాంబూలం ఇస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లో రీజనల్ కార్యాలయంలో గురువారం జగనన్న నవ్యోత్సవాల్లో భాగంగా 'జగనన్న పాలనలో మహిళా సాధికారిత' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ అధ్యక్షత వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు అన్నగా అండగా ఉంటానని భరోసానిస్తున్న సీఎం జగన్‌ను మహిళా లోకం మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన ప్రతి మాటతో పాటు, ఇవ్వని ఎన్నో హామీల్ని సైతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు బత్తుల అనూరాధ, చంద్రగిరి కరుణకుమారి, బొడ్డుపల్లి పద్మజ, మేరిగ విజయలక్ష్మి, మల్లిబోయిన శ్రీవల్లి, మనోరంజని, వనజాక్షి, విజయమాధవి, పిల్లి మేరీ, మాదా రాధాకృష్ణ, కళ్లం హరికృష్ణారెడ్డి, నాలారి ప్రభాకర్, వి. ఓంప్రకాష్‌రెడ్డి, అల్లాబక్షు, చెరుకూరి సాంబశివరావు పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్ తదితరులు

సందడిగా గ్యాడ్యుయేషన్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో గురువారం కిండర్ కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే స్నాతకోత్సవం మాదిరిగా గౌన్లు, టోపీలు ధరించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ దంత వైద్య నిపుణుడు టి. హర్షవర్ధన్‌రెడ్డి చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కర్ రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, క్యాంపస్ ఇన్‌చార్జ్ లలిత పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ



కొరిటెపాడు: భారతీయ స్టేట్ బ్యాంక్ వ్యక్తిగత ప్రమాద బీమా ఒక కుటుంబానికి అండగా నిలిచిందని రీజినల్ మేనేజర్ ఎ.తారకేశ్వరరావు తెలిపారు. రూ. వెయ్యితో వ్యక్తిగత బీమా చెల్లించిన గుంటూరు నగరానికి చెందిన పెద్ది వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తూ మృతి చెందారని, ఆయన కుటుంబానికి అండగా స్టేట్ బ్యాంకు రూ. 20 లక్షలు బీమా పరిహారాన్ని అందించినట్లు వెల్లడించారు. చెక్కును మృతుడి భార్య పెద్ది నాగరాజకుమారికి గురువారం బ్రాడీపేటలోని ఎస్‌బీఐ ట్రజరీ శాఖలో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఆనంద్, ఎం.మాధవ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలు సామాన్యులకు చేరువ చేయాలి

గుంటూరు మెడికల్: నానాటికి ఖరీదవుతున్న వైద్య సేవల్ని సామాన్యులకు చేరువ చేయాలనే లక్ష్యంతో సామాన్య వైద్యశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ, సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ పి.వి జయ అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్సులో గురువారం ఫిజీషియన్ డాక్టర్ ఈదర ప్రజ్ఞాంజలి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్యశాలను ముఖ్య అతిథులుగా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవశర్మ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఫిజీషియన్ల పాత్ర చాలా కీలకంగా మారిందని, అన్ని రకాల వ్యాధులకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఫిజీషియన్లు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు ఈదర కృష్ణమూర్తి, డాక్టర్ ప్రజ్ఞాంజలి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ రాఘవశర్మ, డాక్టర్ విజయ

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ విధానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, కార్పొరేటర్లు, పార్టీ నేతలు

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ విధానం..నినాదమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో గురువారం నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలతో 'మా నమ్మకం నువ్వే జగనన్న' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఇప్పటికీ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేరువ కావడంతో పాటు వారి సమస్యల్ని అక్కడికక్కడే పరిష్కరించే దిశగా ప్రతి ఒక్క శాసనసభ్యుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఇకపై వి స్తృతంగా ప్రజల్లోకి వెళ్లడానికి 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ద్వారా శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా, కార్పొరేటర్లు కామిరెడ్డి రంగారెడ్డి, ఇత్రి ధనలక్ష్మి, వేముల జ్యోతి, ఆబీద్ బాషా, మీరావలి, ఖాజామొహీద్దీన్ చిష్టి, యాట్ల రవి, దూపాటి వంశీ, అజయ్‌కుమార్, సంకూరి శ్రీను, వైఎస్సార్ సీపీ నేతలు ఇత్రి సాయి, రాచమంటి భాస్కర్, సత్యనారాయణ, నూర్‌ఖాన్, శ్రీనివాసరావు, చిలకా రమేష్, సుబ్బులు, స్వర్ణ పాల్గొన్నారు.

అశాస్త్రీయ భావాలు వీడినపుడే అభ్యున్నతి

పాత గుంటూరు: అశాస్త్రీయ భావాలు వీడినప్పుడే సామాజిక అభ్యున్నతి సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంపాలెంలోని రెవెన్యూ భవన్ జొన్నలగడ్డ జోషి ప్రాంగణంలో పూలే, పెరియార్, అంబేడ్కర్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ నిర్వహించారు. సభకు ఫౌండేషన్ చైర్మన్ బత్తుల విల్సన్ అధ్యక్షత వహించారు. హేతువాద సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రశ్నించడం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం సాధించేవరకు పోరాడాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ సంస్కృతిపై స్పందించే స్థితిలో అధికార ప్రతిపక్షాలు లేవన్నారు. హేతుబద్ధంగా ఆలోచించేవారు ఎక్కువ కాలం జీవిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా, తార్కికంగా ఆలోచించాలన్నదే పెరియార్ ఆలోచనా విధానమన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఆర్. కరికాలవలవన్ మాట్లాడుతూ పెరియార్ అనుభవంలో నుంచి పరిణతి చెందిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. దేవరాజ్ మాట్లాడుతూ వర్ణ వివక్షత మీద పోరాడిన పూలే, పెరియార్, అంబేడ్కర్ పూజ్యనీయులన్నారు. అట్టడుగు వర్గాల విద్యకోసం పోరాడారని పిలుపునిచ్చారు. చైతన్య భావాలను, పుస్తకాలను పరిచయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బండారు సురేష్, గోలి మధు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కొరివి వినయ్‌కుమార్

చుట్టుగుంటకు మహర్దశ

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: గుంటూరు నగరంలోని కీలక కూడళ్లలో ఒకటైన చుట్టుగుంట జంక్షన్‌కు మహర్దశ పట్టిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఓవైపు అభివృద్ధి మరోవైపు ఆధ్యాత్మికం, ఓపక్క ఆటలు, మరోపక్క ఆహ్లాదంతో త్వరలో రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవనుందని చెప్పారు. శరవేగంగా జరుగుతున్న పనుల్ని గురువారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, స్థానిక కార్పొరేటర్ అడకా పద్మావతితో కలసి పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ లేకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు సమగ్రాభివృద్ధి సాధనే తన సంకల్పమని తెలిపారు. చెన్నై, హైదరాబాద్‌ల నుంచి నగరంలోకి ప్రవేశించే చుట్టుగుంట జంక్షన్‌ను రాష్ట్రానికే ఒక రోల్ మోడల్‌లా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని నందనవనంలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి తదితరులు

నేడు స్టువర్టుపురంలో బజరంగ్ ఫౌండేషన్ సేవలు

సీఈఓ మురళీకృష్ణ



కొరిటెపాడు(గుంటూరు): సామాజికాభివృద్ధి, సుస్థిర ప్రగతి లక్ష్యాలుగా బజరంగ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని బజరంగ్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్ల నియోజకవర్గంలోని స్టువర్టుపురంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. బజరంగ్ జగన్నాథ సంక్షేమ సంవత్సరంలో భాగంగా గ్రామంలోని పేద, బడుగు, గిరిజన వర్గాలకు చెందిన మహిళలకు నారీ రుతువు కార్యక్రమం ద్వారా శానిటరీ నాప్ కిన్ల పంపిణీ, విద్యా విజేత కింద గ్రామంలోని విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని వలంటీర్లకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం, రూ.5 లక్షల ప్రమాద బీమా బాండ్లను అందజేసే కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమాల్లో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

12న కాటూరి మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. పెదనందిపాడు గ్రామంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో ఉచితంగా అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు కూడా అందజేస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చేవారికి భోజన వసతి ఏర్పాటు చేశామని, ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

8న మాలల చైతన్య సదస్సు



నెహ్రూనగర్: రాష్ట్రంలోని మాలల ఐక్యతే ధ్యేయంగా ఈ నెల 8న అన్నవరంలో మాలల చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం మాల సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలపై దాడులు అధికమవుతున్నాయని ఆరోపించారు. కోనసీమకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును వ్యతిరేకిస్తూ చేపట్టిన హింసలో మంత్రి, ఎమ్మెల్యే ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేసిన వారిపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయడాన్ని ఖండించారు. వివిధ కేసుల్లో ఎస్సీలపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ మాల సంఘాల నాయకులు గోదా జాన్‌పాల్, మల్లెల వెంకట్రావు, పంతగాని రమేష్, తుమ్మల ఫ్రాన్సిస్, బత్తుల వీరాస్వామి, ఈమని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



పాత గుంటూరు: కొరిటెపాడు సాకేతపురంలోని సాకేత రామాలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకుని గుంటూరు జిల్లా రచయితల సంఘం, శ్రీ సీతారామాంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం. సుభాని కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం. లలిత కుమారి, ఈవూరి వెంకటరెడ్డి, జి. మల్లికార్జునుడు, నానా, చుండూరు శేషుమాంబ, టి. పద్మావతి, వై. పద్మావతి, పి. బలరాం, దారివేముల అనిల్ కుమార్, పి. దుర్గాదేవి పాల్గొన్నారు. రామాయణంలోని అనుబంధాలపై పలు అంశాల్ని వివరిస్తూ కవితాగానం చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కాకి శ్రీనివాసరావు దంపతులు కవులకు ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యుడు బుర్రి కుమార్‌రాజు పాల్గొన్నారు.

